

# తిరిగిరాని గతం

- డి. కామేశ్వరి

ఆటో దిగి శ్రీవల్లి లోపలికి అడుగుపెట్టింది. అప్పుడే ఇంట్లోంచి ఏదో శవం వెళ్లినట్లు ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అంతా తలో మూల వాడిన మొహాలతో కూర్చుని వున్నారు. మహిమ తండ్రి పేపరు ముఖానికి అడ్డం పెట్టుకున్నారు. పెద్దన్నయ్య శ్రీధర్ ఓ పుస్తకం, చిన్నన్నయ్య శ్రీకర్ ఓ పుస్తకం పట్టుకుని కూర్చున్నారు - మహిమ ఎక్కడుందో కనపడలేదు - "అంకుల్.... ఏమయింది? ఎందుకు అంత అర్జంటుగా రమ్మన్నారు....." వల్లి అందర్నీ చూస్తూ ఆరాటంగా అడిగింది. వల్లి గొంతు వినగానే మహిమ తల్లి జానకి, పెద్ద వదిన శశిరేఖ, చిన్న వదిన లత లోపల్నించి వచ్చారు.... అంతా ఒక్కసారి 'అది కాదు వల్లీ....' అంటూ ఏదో చెప్పబోయారు. 'ష్.... వుండండి, కూర్చో వల్లీ....' అంటూ రాజారావు గారు అందరినీ వారించి "ఏం లేదమ్మా.. నీకు తెల్సు గదా ఇవాళ మహిమని చూడటానికి సాయంత్రం మీ పినమామగారి అబ్బాయి వస్తున్నాడు గదా, అతన్ని తీరా పెళ్లి చూపులకి పిలిచాక ఇప్పుడు మహిమ ఏమో తనకేం పెళ్లిచూపులు వద్దు, ఇప్పుడసలు పెళ్లే చేసుకోను అంటోంది' రంగానాథంగారు మొదలుపెట్టారు.

"ఉదయం నుంచి గొడవ మొదలుపెట్టింది... తనకి చెప్పకుండా అసలు ఎందుకు పిలవాలని ఎగిరిపడ్తోంది" జానకమ్మ మొహం ఎర్ర పరుచుకుని ఆవేశంగా అంది. 'మంచి సంబంధం.... పెద్ద చదువులు చదివి, పదివేల రూపాయలు తెచ్చుకుంటున్నాడు. అన్నింటికంటే నీ బంధువులు, మంచి కుటుంబం, అబ్బాయి బాగున్నాడు ఫొటోలో... ఇంతకంటే ఇంకేం కావాలి ఏ ఆడపిల్ల కన్నా.... యిన్నాళ్లు చదువు అని అంటే సరే అన్నాం.... ఇప్పుడింకేం అభ్యంతరం అని పెళ్లి చూపులు ఏర్పాటుచేస్తే....' ఆవిడ ఆవేశంగా చెప్పుకుపోతోంది.

"దానికి ముందుగా చెప్పలేదనుకో, ఎలాగో శలవులకి వస్తోంది. వచ్చాక చెప్పొచ్చు అని రాయలేదు - ఏదీ నిన్ననేగా వచ్చింది - ఉదయం లేచాక సావకాశంగా కూర్చోపెట్టి చెపుదాం అనుకునేసరికే..." అన్నారు రంగనాథం గారు.

"పొద్దునే లేవగానే ఇంట్లో హడావుడి చూసింది. ఆ తరువాత మొదలుపెట్టింది గొడవ.... తనకు చెప్పకుండా పిలిచారని, అంచేత తన తప్పు ఏంలేదని, ఎంతమాత్రం పెళ్లిచూపులకి కూర్చోనని గొడవ...."

"అంటే, అసలు పెళ్లి వద్దంటోందా... లేక పెళ్లిచూపులవి వద్దంటోందా, అసలు తన అభిప్రాయం ఏమిటట? పెళ్లే చేసుకోనంటుందా, లేక అరేంజడ్ మేరేజ్ వద్దంటుందా" శ్రీవల్లి మధ్యలో అంది.

"ఏది సరిగా చెపితే గదా తల్లి. ఇప్పుడీ పెళ్లిచూపులు వద్దట. తనింకా పెళ్లి గురించి ఆలోచించలేదట. కొన్నాళ్లు జాబ్ చెయ్యాలట. ఏదేదో అంటోంది" రంగనాథం గారన్నారు వాడిన మొహంతో.

"చూడమ్మా వల్లీ... నీవే నీ స్నేహితురాలికి ఎలాగైనా నచ్చచెప్పి ఒప్పించి సాయంత్రం పని జరిగేట్టు చూడు తల్లి. లేకపోతే మా పరువు పోతుంది. నీ బంధువులు కూడాను... దానితో కాస్త మాట్లాడమ్మా వెళ్లి...."

"వుండండి అంకుల్.... నేనసలు విషయం ఏమిటో కనుక్కుంటాను. మీరు వర్రీ కాకండి. నేను ఒప్పిస్తానులెండి - ఎక్కడుంది.... మేడమీద వుందా...." వల్లి లేచింది.

"ఏం చేస్తావో, ఎలా ఒప్పిస్తావో, పరువు కాపాడేట్టు చూడమ్మా.... చేసుకోవడం మానడం తరవాత ఆలోచిద్దాం. ముందు పెళ్లి చూపులకి కూర్చునేట్టు ఒప్పించు" జానకమ్మ నీదే భారం అన్నట్లుగా అంది.

వల్లి మహిమ గదిలోకి వెళ్లేసరికి ముఖం ముడ్చుకుని కూర్చున్న మహిమ వల్లిని చుర చుర చూసింది. "అందరూ అయ్యారు నీవొక్కదానివి మిగిలావనా ఉపదేశాలు చెయ్యడానికి వచ్చావు -" స్నేహితురాలి మీద గయ్‌మని లేచింది. వల్లి నవ్వి మంచం మీద కూర్చుని, "ఏమిటే నీ అలక. దేని కోసం ఈ రాద్ధాంతం..." హాస్యంగా మొదలుపెట్టింది.

"షటప్.... పెద్ద తెలివిగా మాట్లాడుతున్నావని అనుకోకు. అన్నీ విన్న నువ్వు నాకేం ప్రేమలు దోమలు మీద నమ్మకాలు లేవనీ తెలిసే అడుగుతావెందుకు" గయ్‌మంది. ఆమె లేత గులాబి రంగు మొహం ఎర్ర గులాబి రంగులోకి మారింది.

"అయితే మరి పెళ్లిచూపులు వద్దంటూ ఈ గొడవేమిటి - ప్రేమలు లేవు గనకే పెద్దవాళ్లు కుదిర్చిన సంబంధం చేసుకోడానికేం.... ఇరవై మూడేళ్లు వచ్చాయి ఇంకా నీకు పెళ్లివయసు రాలేదనా నీ ఉద్దేశం. కన్నవాళ్లకి కూతురి పెళ్లి చేసి బాధ్యత తీర్చుకోవాలన్న ఆరాటం వుండగా..... వాళ్ల ఆరాటం అర్థం చేసుకోకుండా చిన్నపిల్లలా యీ ఆగడం ఏమిటి.... నీ వయసుదాన్ని నాకు పెళ్లి అయి ఏడాది అయింది...." నచ్చజెప్పే ధోరణిలో అంది.

"ఏం నీవు చేసుకుంటే నేను చేసుకోవాలని రూలుందా.... నాకిప్పుడు పెళ్లి చేసుకోవాలని లేదు. చేసుకోదలచనప్పుడు యీ పెళ్లి చూపులేమిటి?" విసుగ్గా అంది.

"ఇప్పుడు చేసుకోవాలని లేదా. అసలు చేసుకోవాలని లేదా...." రెట్టించింది వల్లి.

"ఐ హేట్ టు గెట్ మారీడ్... నాకు పెళ్లంటే అసహ్యం.... జీవితంలో పెళ్లి తప్ప మరీ ముఖ్యమైనదేదీ లేనట్టు పెళ్లి పెళ్లి అని చంపుతావెందుకు.... ఏం లేకుండా బతకలేమా.... ఏమో తరువాత సంగతి ఎలా మారుతుందో నాకు తెలియదుగాని ఇప్పుడు ఎంతమాత్రం పెళ్లి చేసుకోవాలని లేదు...." మొహం ఎర్రపరచుకుని సీరియస్‌గా అంది.

"మరేం చెయ్యాలని నీ ఉద్దేశం....?"

"ఏం చెయ్యడమేం... ఉద్యోగం చేస్తాను. కొన్నాళ్లు హాయిగా, ఫ్రీగా, స్వాతంత్ర్యంగా లైఫ్ ఎంజాయ్ చేస్తాను.

"ఇదిగో మహీ.... చూడు పెళ్లి చేసుకున్న ఆడవాళ్లంతా అష్ట కష్టాలు పడిపోవడం లేదు, చేసుకోని ఆడవాళ్లంతా సుఖపడ్తున్నారని చెప్పలేము. దేన్లో వుండే ఇబ్బందులు దాన్లో వున్నాయి. నీలా అందరూ అనుకుంటే నూటికి తొంభై తొమ్మిది ఆడవాళ్లు, మగవాళ్లు పెళ్లిళ్లు ఎందుకు చేసుకుంటారన్నారంటావు - సెక్యూరిటీ కోసమో, ఛేంజ్ కోసమో, సుఖం కోసమో, పిల్లల కోసమో, ఏదో ఒకటి ఆశించే చేసుకొంటున్నారు గదా - పెళ్లి చేసుకోకుండా వుంటే ప్రాబ్లమ్స్ వుండవనా..."

"అందరి సంగతి నాకెందుకు, నాకేం ప్రాబ్లమ్స్ వుంటాయి. చదువు

కున్నాను, ఏదో ఉద్యోగం చేస్తూ ఇండి పెండెంట్‌గా వుండగలను. నాకేం ఇబ్బం దులుంటాయి. ఒకవేళ ఏదన్నా ఇబ్బం దులుంటే అప్పుడే ఆలోచించ వచ్చు." మొండిగా అంది.

"అవును.... ఏ ముప్పైకో, నలభైకో ఈ ఒంటరితనం విసిగెత్తి అప్పుడు ముసలమ్మవి అయ్యాక చేసుకుందువు గాని... చూడు మహీ, ఇప్పుడు ఏదో ఆవేశమో, ఆదర్శమో ఏదో అనుకుని ఇలా వచ్చిన మంచి అవకాశాన్ని వదులుకుంటే తర్వాత విచారిస్తావు. ఎందుకంటే ఏ వయస్సులో జరగా ల్సినవి ఆ వయసులో జరగాలంటారు పెద్దవాళ్లు. నీవెప్పుడో మనసు మార్చు కునే వేళకి టూ లేట్ అవచ్చు. నీ సంగతి అలా వుంచు.... కన్నవాళ్ల సంగతి ఆలోచించావా - వాళ్లకి వాళ్లుండగా వాళ్ల బాధ్యతలు తీర్చుకోవాలని వుండదా..."



"అబ్బ, నీవేమిటి మామ్మలా, అమ్మమ్మలా మాట్లాడుతూ సాధిస్తున్నావు, ఏం యిప్పుడేం కొంప మునిగిందని గొడవ చేస్తున్నారు, నాకేదో నలభై ఏళ్లు రేపోమాపో వచ్చేస్తున్నట్లు రాద్ధాంతం చేస్తున్నారు. పాతికేళ్లకి ఇంకా రెండేళ్లు తక్కువే నాకు -" వల్లి అదోలా నవ్వింది.

"నలభై వచ్చేస్తే ఇంక గొడవెవరు చేస్తారు. చేయడానికి ఏముంటుంది అప్పుడు. ఎప్పటికయ్యేది ప్రస్తుత మప్పటకని. పెద్దవాళ్లు ఆరాటపడ్తున్నారు. అసలింతకీ నీకు పెళ్లి మీద యింత విముఖత ఎందుకొచ్చింది, ఎప్పు డొచ్చిందో" కాస్త వ్యంగ్యంగా అడిగింది.

ఎందుకొచ్చిందంటే సరి అయిన జవాబు మహిమ దగ్గిర లేదు. చిన్నప్పటి నుంచి కాస్త జ్ఞానం వచ్చిందగ్గిరనుంచి అంటే పది ఏళ్లు దాటిం దగ్గర నించి పెళ్లి, మొగుడు పెళ్లాల సంబంధం అంటే అదో రకం ఏవగింపు, జుగుప్స, భయం లాంటిది మనసులో చోటు చేసుకుంది. రాత్రిళ్లు నిద్ర మధ్యలో మెళకువ వచ్చినప్పుడు బెడ్‌లాంప్ వెలుగులో తండ్రి తల్లి దగ్గిరకి చేరి... పగలంతా ఎంతో గంభీరంగా కనిపించే ఆయన అదో రకంగా నవ్వుతూ, తల్లి తండ్రి ప్రవర్తన చూసి అదో రకం జుగుప్సతో కళ్లు గట్టిగా మూసుకునేది. అంతే కాదు యింట్లో పనిమనిషి వారానికో రోజు మొగుడు కొట్టాడని వళ్లంతా కమిలిపోయిన దెబ్బలతో, కళ్ల కింద నల్ల మచ్చతో ఏడుస్తూ వచ్చేది. మొగుడయితే అలా కొట్టాడా, కొట్టే ఎందుకూరుకుంటుంది ఇది. ఆ చిన్న వయసులో ఎన్నో సందేహాలు. పోనీ అప్పి అంటే సరే పక్కింటి వరలక్ష్మమ్మ గారు తల్లి దగ్గిర అన్నీ చెప్పుకుని ఏడిచేది. చిన్నప్పుడు అత్తగారి చేతిలో వాతలు, మొగుడు చేతిలో దెబ్బలు, పెద్దయ్యాక కొడుకుల చేతిలో చివాట్లు అవమానాలు భరిస్తూ రోజంతా పడి వంటింట్లో చాకిరి చేసినా కోడళ్ల దెప్పుళ్లు... అన్నీ వింటూ ఆడదాని జీవితం అంతా అలా మొగాళ్ల కింద నికృష్టంగా బతకడమా అనిపించేది ఆ తెలిసీ తెలియని వయసులో. నాలుగిళ్ల అవతల గుమస్తా గారి భార్య కామాక్షి పాతికేళ్లకే నలుగురు పిల్లల్ని కని అస్థిపంజరమై రోజంతా పిల్లలతో ఉచ్చులు దొడ్లు, అంట్లు, వంటతో యిటు కడుపుతోనో, అటు చంటి పిల్లతోనో తప్ప, కనపడక ఎందుకు వీళ్లు ఈ పెళ్లి సంసారం అనే రొంపిలో పడి బాధలు కొని తెచ్చుకుంటారు అనుకునేది పదిహేనేళ్ల మహిమ - పెళ్లవగానే తన పుట్టినరోజులు కూడా మర్చిపోయి యిరవై నాలుగు గంటలూ పెళ్లాం కొంగు పట్టుకుని గదిలోంచి ఊడిపడని పెద్దన్నయ్యలో మార్పుకి ఎంత ఆశ్చర్యం కల్గిందీ... అన్నెల్లు దాటేసరికే ఆ ప్రేమ దోమ అంతా ఎగిరిపోయి ఇద్దరూ ఎలా వాదించుకుంటూ దెబ్బలాడుకునే వారో చూసి పెళ్లంటే ప్రేమంటే యింతేనా, మూడు నాళ్ల ముచ్చటా' అన్పించింది. ఆ దృశ్యాలు మహి మని హంట్ చేసి స్త్రీ పురుష సంబంధం పట్ల మరింత ఏహ్యత పెంచి - పెళ్లి అంటే అదో రకం ఏవగింపు భయం కల్గిం చాయి - ఇలా ఎన్నో చూసినది, చదివి నవి అన్ని కలిసిన అనుభూతులన్నీ కలిపి వడబోసి యూనివర్శిటీ స్థాయికి చేరేసరికి పెళ్లి అనేది అర్థం లేని, అవసరం లేని బంధాన్ని తను తగి లించుకుని చేతులారా బాధలు కొని తెచ్చుకోరాదన్న నిర్ణయానికి వచ్చేసింది మహిమ.

"ఏమిటే మాట్లాడవు.... ఏం మాట్లాడాలో తెలియడం లేదు. చూడు మహిమా నీవు మామూలుగా చూడ వలసినవి భూతద్దంలోంచి చూస్తూ, ఏవేవో ఊహించుకుంటున్నావనిపి స్తుంది. మగాళ్లంటే, మొగుళ్లంటే రాక్షసులని ఎందుకు అనుకోవాలి. ఎక్కడో నూటికి కోటికి అలా వుండొచ్చు - ఎంతోమంది సహృదయులు, సంస్కారులుంటారు. అందులో ఈ రోజుల్లో అంత చదువుకున్నవాళ్లు, తమతో సరిగా చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న భార్యల్ని నీవనుకున్నట్టు యిల్‌ట్రీట్ చెయ్యడం లేదు...."

"అ.... చూస్తున్నాం.... రోజూ పేపరు తెరిస్తే వరకట్నం చావులు, పెళ్లాన్ని కాల్చుకుతినే మొగుళ్ల కథలు, సంసార బాధలు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న ఆడవాళ్లు, రేప్‌లు చేసి చంపేసే కథలు... హు... ఆడదాని బతుకు మారిపోయిందని మనల్ని మనం నమ్మించుకుని ఆత్మవంచన చేసుకుంటున్నాం" వ్యంగ్యంగా అంది.

"చూడు మహీ.... దేశంలో ఎనభై కోట్ల ప్రజలుంటే పేపర్లలో, వార్తల్లో వచ్చే వార్తల్లో చావులు, రేపులు పదో పదిహేనో వుంటుంటాయి. అంటే ఎక్కడో ఏదో ఒకటి అర సంఘటనలు పేపర్లలో వచ్చినంత మాత్రాన అదే అందరిళ్లల్లో జరిగే సంఘటనలని ఎలా అంటావు... అదే నిజమయితే ప్రతిరోజు యిన్ని లక్షల మంది పెళ్లిళ్లు ఎందుకు చేసుకుంటున్నారంటావు - పెళ్లి, సంసారంలో కేవలం కష్టాలు కన్నీళ్లు అవమానాలే వుంటే ఈ బంధాన్ని తగిలించుకోడానికి నూటికి తొంభై తొమ్మిది మంది ఎందుకు తయారవుతున్నారు?" జవాబు చెప్పమన్నట్లు చూసింది.

"ఏం చేస్తారు ఆడపిల్లలు - ఇదిగో ఇలా తల్లి తండ్రి చంపితే ఎదురు చెప్పి ఒంటరిగా నిలబడే ధైర్యం లేక... ఈ సమాజంలో ఓ పెళ్లి కాకపోతే, మగాడి అండ లేకపోతే బతకమన్న పిరికివాళ్లు యీ ఆడవాళ్లు...." ఆవేశంగా అంది.

వల్లి, ఎలా మహిమని కన్విన్స్ చేయడం అన్నట్టు నిస్సహాయంగా చూసింది - చిన్నప్పటి నుంచి అంటే కాన్వెంట్, హైస్కూలు, కాలేజీల వరకు ఇద్దరూ కల్సి చదువుకున్న స్నేహితులు.... మహిమ అందం, తెలివి పట్టుదల అంతా చూసి ఎంతో ఆకర్షితురాలయ్యేది వల్లి. క్లాసులో చదువులో ఫస్టు వచ్చే మహిమ అంటే హీరోయిన్ వర్షిప్ వల్లికి - బి.ఏ. కాంగానే తల్లితండ్రులు పెళ్లి చేస్తే బుద్ధిగా చేసేసుకుంది. మహిమ ఎమ్.ఎస్సీ. చేసి ఇంకా పై చదువులు చదివి ఉద్యోగాలు చెయ్యాలనుకుంటుందని తెల్సినా పెళ్లంటే ఇంత విముఖంగా వుందన్నది ఆమెకీ రోజువరకు తెలియదు. ఆమెకి నచ్చచెప్పాలని వచ్చిందిగాని మహిమ ధోరణి చూస్తే అది అంత సులభంగా సాధ్యపడేదిగా అన్పించలేదు.

"మహీ... చూడు మా పినమామగారి అబ్బాయి ఎంత స్మార్ట్‌గా వుంటాడో తెలుసా. ఇంజనీరింగ్, ఎం.బి.ఏ. చేసి టాటా కన్సల్టెన్సీలో

బొంబాయిలో ఎంత మంచి ఉద్యోగంలో వున్నాడో తెలుసా; ఫ్లైట్, కారు... పట్టుమని ఇరవై ఎనిమిదేళ్లు లేని అతను అప్పుడే ఇంత మంచి పొజిషన్‌లో వున్నాడు.... మంచి ఫ్యూచర్ వుంది. నరేష్ చాలా బుద్ధిమంతుడు. బాగా తెలుసు అతని స్వభావం నాకు... ఇలాంటి సంబంధం కావాలనుకున్నప్పుడు రాదు - ముందసలు అబ్బాయిని చూడు....' తరువాత సంగతి ఆలోచిద్దాం - ప్లీజ్ నా కోసం...."

"వల్లీ.... చూడు... పెళ్లి చూపులయ్యాక వద్దంటే మరింత ఇన్సల్ట్ ఫీలవుతారు. ఎవరన్నా. అందుకే ముందే వద్దంటున్నాను. మంచి సంబంధం కాదన్నానా నేను. చేసుకోదలచనప్పుడు అనవసరంగా చూడ్డం ఏమిటి. సారీ, మీ బంధువులబ్బాయి నీ పొజిషన్ నాకర్థం అవుతుంది. కాని నాకెందుకో ఇప్పుడసలు చేసుకోవాలని లేదు. ఏమో చూద్దాం కొన్నాళ్లు పోతే నా మనసు మారితే..."

"అప్పటివరకు నీకోసం కూచుంటాడా ఇతను..." కోపంగా చూసింది. మహిమ నవ్వింది.

"ఇతన్ని కూచోమన్నానా నేను - అసలు వల్లీ, నేను పెళ్లంటూ చేసుకుంటే నాకెవరన్నా తటస్థపడి, ఇద్దరి అభిప్రాయాలు కల్సి, నాకు నచ్చితే నా అంతట నేను చేసుకుంటాను. ఇలా పెళ్లి చూపులు, అరేంజెడ్ మేరేజి నేను చేసుకోను. మీవాళ్ళకి చెప్పేయి ఆ మాట..." సిర్థ నిశ్చయం చేసుకున్నదానిలా అంది.

వల్లి నిస్సహాయంగా చూసి లేచి నిలబడింది.

తరువాత నాలుగు అయిదు రోజులు ఇంట్లో ఎంత గొడవ జరగాలో అంతా జరిగింది. తల్లి ఏడుపులు, తండ్రి హితభోధలు, అన్నల బెదిరింపులు, వదినల హితబోధలు ఏవీ మహిమని కదల్చలేకపోయాయి. అంతా నిస్పృహతో మహిమని శాపనార్థాలు పెట్టినట్టే, 'నీ ఖర్మ.. నీ రాత ఎలా వుందో అందుకే నీకీ పెడబుద్ధులు పుట్టాయి. పెద్దవాళ్లు నీ మంచి కోరి చెప్పింది వినకపోతే నీవే తరువాత అనుభవిస్తావు. మేం వున్నన్ని' రోజులు బాధపడ్తాం. తరువాత నీ అతిగతి ఎవరికీ పట్టదు. అప్పుడు నీవు కావాలన్నా నీకు కావాల్సింది దొరకపోవచ్చు, కానీ అనుభవమే నీకు పాఠం చెప్తుంది" అన్నాడు తండ్రి. 'పోనీ నీ అంతట నీవు చేసుకున్నా ఆ చేసుకునేదేదో మరీ ఆలస్యం కాకముందు చేసుకో..." ఆఖరి ఆశగా తల్లి అంది.

✵ ✵ ✵ ✵

కాలచక్రంలో ఇరవై రెండేళ్లు గడిచిపోయాయి. మహిమ డాక్టర్ మహిమ అయింది మూడేళ్లు ఫారెన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి డాక్టరేట్ సంపాదించుకుని యూనివర్శిటీ ప్రొఫెసర్‌గా స్థిరపడింది. బంగళా, కారు, పనికి, వంటకి మనుషులు... వుండాల్సిన హంగులన్నీ వున్నాయి.

ఈ ఇరవై రెండేళ్లలో ఆరేడు ఏళ్లు చాలా బిజీగా అసలు దేన్ని గురించి ఆలోచించే తీరిక లేకుండా చదువు. ఫారెన్ వెళ్లి రావడం ఉద్యోగంలో స్థిరపడడంతో అయిపోయింది. రాజారావు గారు రెండు మూడుసార్లు పెళ్లి ప్రస్తావన తెచ్చినా మహిమ 'డాక్టరేట్ అవ్వాలి ఇప్పుడప్పుడే నేనేం అనుకోలేదు' అంది. ఆయన నిట్టూర్చి వూరుకున్నారు. మహిమ ఫారెన్ నుంచి వచ్చేలోగానే ఓ రోజు హార్ట్ అటాక్ వచ్చి ఆయన పోయారు. తరువాత తల్లి ఏడుస్తూ నాలుగు అయిదుసార్లు బతిమిలాడింది. "నేనూ పోయాక ఇంక నిన్ను గురించి పట్టించుకొనే వారెవరో.... నా మాట విను - చదువయింది ఉద్యోగం అయింది. ఇరవై తొమ్మిదేళ్లు వచ్చాయి యింకెప్పుడు..." అంటూ గోలపెట్టేది. తండ్రి పోయాక తన దగ్గిర వచ్చి వుండమన్న తల్లి ఆ యిల్లు విడిచి, ఆ వూరు విడిచిరానంది. తల్లిని కష్టపెట్టడం ఇష్టం లేక 'అలాగే చూద్దాంలే... నాకు నచ్చిన ఎవరన్నా కనిపిస్తే చేసుకుంటాలే" అనేది మహిమ.

నిజం చెప్పాలంటే ముప్ఫై ఏళ్లు వచ్చేవరకు అసలు మహిమ పెళ్లి గురించే ఆలోచించలేదు. ఒంటరితనం విసుగనిపించలేదు. ఐదారేళ్లు చదువయ్యాక కొత్త ఉద్యోగం. కోలీగ్స్‌తో సరదాగా గడపడం, స్టూడెంట్స్‌తో చనువుగా వుంటూ, కొందరు స్టూడెంట్స్ ఇంటికి వచ్చి చదువు చెప్పించుకుంటూ.... ఫ్రెండ్సుతో పిక్నిక్‌లు పార్టీలు అంటూ లైఫ్ ఎంజాయ్ చేసింది. పుస్తకాలు చదవడం, టి.వి. చూస్తూంటే రాత్రి గడిచిపోయేది. శలవుల్లో ఇంటికెడితే అన్నయ్యలు, పిల్లలతో రోజులు నిమిషాల్లా గడిచేవి.

మహిమకి తల్లి పోయే నాటికి ముప్ఫై నిండింది. ఆవిడ ఆఖరి కోరిక తీరలేదన్న వ్యధతోనే పోయింది ఆవిడ.

ముప్ఫై ఏళ్లు నిండి జీవితం రొటీన్‌గా మారిపోయాక మహిమకి ఆ జీవితం పట్ల కాస్త అనాసక్తత, విసుగు మొదలైంది. రోజూ అవే పాఠాలు, అదే యూనివర్శిటీ, అవే కోలీగ్స్ ముఖాలు. ఉదయం లేచిం దగ్గరనుంచి ప్రతిది ఏదో రొటీన్‌గా తయారైంది అన్పించడం మొదలుపెట్టింది. జీవితంలో ఏదో కావాలని, మార్పు కోరసాగింది ఆమె మనసు. అందరూ తన కళ్ల ముందే మొగుడు పిల్లలతో సంసారాల్లో పడిపోతే తనొక్కర్తే ఇలా ఒంటరిగా మిగిలిపోయిందనిపించసాగింది. కనిపించిన మంచి చీరల్లా కొని వార్డ్ రోబ్ నింపేసే మహిమకి .... ఈ చీరలు ఎవరికోసం కట్టుకోడం... ఇంట్లో ఈ ఫర్నిచర్లు ఈ మార్పులు చేర్పులు ఎవరు చూడాలని... ఈ డబ్బు సంపాదించి ఎవరికి పెట్టాలి లాంటి ప్రశ్నలు తలెత్తడం ఆరంభించాయి. చీరల మీద, ఈ అలంకరణ మీద, పార్టీల మీద శ్రద్ధ తగ్గి అదోలా మూడీగా వుండసాగింది. చాలింక ఈ జీవితం.... కొత్త రకం జీవితం మొదలుపెట్టాలి అనిపించింది. తనని ఇప్పుడెవరన్నా పెళ్లి చేసుకో అంటే బాగుండును.... ఏదన్నా సంబంధం చూస్తే చేసుకో అని బలవంతం చేస్తే.... ఆ సమయంలో హఠాత్తుగా తల్లి, తండ్రి తన పెళ్లి గురించి ఎలా పలవరించారో గుర్తు వచ్చేది. అన్నయ్యలిద్దరూ బొత్తిగా తన గురించి పట్టించుకోడం మానేశారు. తల్లి వుండగా శలవులకి వెళ్లేది. ఇప్పుడసలు 'రా' అని కూడా ఎవరూ అనడం లేదు. తనంతట తాను నేను పెళ్లి చేసుకుంటాను సంబంధాలు చూడండి అని ఎలా చెప్పడం, ఎవరికి చెప్పడం అనిపించేది -

ఇప్పటివరకు ఏ పురుషుడూ ఆమెని ఎట్రాక్ట్ చెయ్యలేదు. యూనివర్శిటీలో కోలీగ్స్ అంతా పెళ్లయిన వాళ్లు... ముసలి భావాలు, సంసార జంజాటాల్లో ఇరుక్కుపోయిన వాళ్లు తప్ప స్మార్ట్‌గా, చలాగ్గా వుండే మగవాడే ఆమెకి పరిచయం కాలేదు. అలా అనేకంటే ఆమె పరిచయం చేసుకోలేదు - ఒకరిద్దరు ప్రొఫెసర్లు మహిమ పెళ్ళికానిదని కాస్త చొరవ తీసుకోడానికి ప్రయత్నించి, ఆకర్షించాలని ప్రయత్నం చేసినా మహిమ అలాంటి అందరినీ దూరంగానే వుంచేది. జీవితం అంటే యూనివర్శిటీ, పాఠాలు మాత్రమేకాదు ఇంకేదో కావాలి - అనిపించే వేళకి ముప్ఫై నాలుగు నిండాయి మహిమకి.

ఆ టైములో ఓసారి వల్లి పుట్టింటికి వచ్చింది. ఇద్దరు టీనేజ్ పిల్లలుతో పక్కా యిల్లాలు అయిపోయింది. అక్కడికి మహిమ వెళ్లేసరికి వల్లి పినమామగారి కొడుకు నరేష్ అంటే మహిమ కోసం చూసిన అతను భార్యతో సహా - ఒక్క క్షణం అచేతనంగా నిలబడిపోయింది వల్లి పరిచయం చేస్తుంటే, ఇతన్నా తను వద్దంది... ఎంత స్మార్ట్‌గా, ఎంత హుందాగా వున్నాడు. అతని భార్య అయితే ఎంత బాగుందీ... యిద్దరినీ చూస్తే, వాళ్ల జోక్స్ మాటలు వింటూంటే 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటే యిదేనేమో అనిపించింది. పిల్లలిద్దరూ కడిగిన ముత్యాల్లా వున్నారు. ఆ ముచ్చటైన దంపతులని, సంసారాన్ని చూస్తే.... తనది కావాల్సిన దాన్ని చేతులారా వదులుకుంది అన్న భావం ముల్లులా మనసుని తాకింది. పెళ్లి అంటే నరకంలోని అడుగుపెట్టడం మాత్రమే కాదు - అదృష్టం బాగుంటే స్వర్గంలానూ వుండొచ్చు అనిపించింది. ఒకసారి అతన్ని తను చూసి వుంటే ఎంత బాగుండేది - పెళ్లి చూపులు వద్దని ఎంత పొరపాటు చేసింది. ఆమె మొహంలో హావభావాలు కనిపెట్టిన వల్లి స్నేహితురాలి వంక 'చూసావా నీవేం పొందలేకపోయావో' అన్నట్టు చూసింది.

ఇద్దరు స్నేహితురాళ్లు డాబా మీద కూర్చుండగా - 'ఏం ఇప్పటికన్నా పెళ్లి కావాలనిపిస్తుందా లేదా...:" అడిగింది వల్లి. తల ఆడించింది. అది

వద్దనో, కావాలనో మహిమకే తెలియదు. స్నేహితురాలిని చూసి నిట్టూర్చింది వల్లి - అందంగా వుండే మిసమిసలాడే ఆ రంగు వన్నె తగ్గడం ఆరంభించింది. మొహంలో ఆ కళ, నునుపు తగ్గిపోయాయి. కళ్లకింద నల్ల చారలు వచ్చాయి. మొహంలో 'గ్లో' పోయింది. 'లైఫ్ బోర్ కొట్టడం లేదూ... ఒక్కర్తివీ ఒంటరితనం ఫీలవడం లేదూ...."మహిమ తల దించుకుంది. గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు గుటక వేసింది. "చేసుకో మహీ - బిఫోర్ యిట్ జీ టూ లేట్... జీవితంలో ప్రతి మనిషికి మార్పుండాలి.... ప్రతి దశలో మనిషికి మార్పు లేకపోతే పిచ్చెత్తుతుంది. పసితనంలో ఆటపాటలు, చిన్నప్పుడు చదువు సంధ్యలు - యవ్వనంలో పెళ్లి, ఆ తరువాత పిల్లలు, సంసారం... ఇంకా పెద్దయ్యాక మనవలు... ఇలా ప్రతి స్టేజిలో జీవితంలో కొంత అనుభవాలు, అనుభూతులు కావాలి మనిషికి. ప్రతి స్టేజిలో మనిషికి ఓ తోడుండాలి. మనసులోని మాట చెప్పేందుకు నా అనే మనిషి వుండాలి. జీవితం నడిచే రైలు బండిలా వుంటేనే, ఓ గమ్యం చేరాలన్న ఆరాటంతో ప్రయాణంలోని అన్ని ఇబ్బందులు సహించగలడు మనిషి - ఎంత రద్దీ, చెమట, చీదర వున్నా రైలు కదులుతున్నంతసేపు మనిషి సర్దుకుపోతాడు - అదే రైలు ఆగిపోతే ఎంత అసహజంగా, ఎంత ఇబ్బందిగా వుంటుంది మనకు. రైలు కదలాలి. నీవెంత ఎ.సి. క్లాసులో కూర్చున్నా రైలు కదలకపోతే ఆ ఎ.సి. చల్లదనం, నీకు తృప్తినివ్వలేదు. కదలని రైలులో ఎన్ని రోజులు మార్పు లేకుండా కూచోగలవు. నీకు డబ్బుంది, చదువుంది, బంగాళా, కార్లు, చీరలు, నగలు అన్నీ వున్నాయి. కాని నీ జీవితానికి పరిపూర్ణత వుందనిపిస్తుందా - ఏదో లోటూ కన్పించడంలేదూ. మహిమా.... ఇప్పటికయినా తొందరగా ఎవరినన్నా చేసుకో... అన్నింటికన్నా మనిషికి శాపం ఏమిటో తెలుసా? ఒంటరితనం.... అది నీవు ఇప్పటికన్నా గ్రహించలేదూ..."

"నన్నెవరు చేసుకుంటారు ఇప్పుడు..." వినిపించీ వినిపించనట్లుంది.

"ఇన్నేళ్లలో నీకు నచ్చిన మగాడే కన్పించలేదా.... ఫరవాలేదు. ఈ వయసుకీ సరిపోయిన వాళ్లుంటారు. పోనీ పేపర్లో వేయి..." వల్లి సలహా.

ఇంటికి వెళ్లాక ఎందుకో ఏదో దిగులు, గుండెల్ని మెలిపెట్టినట్లు ఇబ్బంది... మహిమకి ఎందుకో అకారణంగా కళ్ల నీళ్లు వచ్చాయి.

ఇప్పుడు మహిమకి నలభై మూడు నిండాయి. మహిమ పెళ్లి ప్రయత్నాలు ఏమీ ఫలించలేదు. పేపర్లలో రెండు మూడు సార్లు అడ్వర్టైజ్ చేసింది. చాలానే వచ్చాయి. జవాబులు చాలావరకు రెండో పెళ్లివాళ్లు, డైవోర్సీలు. కొంతమంది చదువు, సంపాదన తనతో ఎందులోనూ తూగనివారు. అందులో కాస్త నచ్చినవి రెండు, మూడు. ముగ్గురిని పిలిచింది ఇంటర్వ్యూకి. ఒకతను ఎండిపోయి కట్టె పేడులా వుండి, వున్న అరగంటలో ఆరు సిగరెట్లు కాల్చాడు. ఇంకోడు బట్ట తల, బాన పొట్ట - కళ్లెర్రగా తాగినవాడిలా... వున్న ఐదు నిమిషాల సేపు మహిమని చూపులతో తినేసాడు - మహిమకి అందరినీ చూస్తే కంపరం ఎత్తింది. ఇన్నాళ్లుండి ఇలాంటి వాళ్లనా చేసుకునేది. పిల్లలున్న వాళ్లని, డైవర్సీలని అసలు పిలవలేదు. ఏభై ఏళ్ల వాళ్లు కాకపోతే పాతికేళ్ల బాలా కుమారులు ఎవరొస్తారు తనకు. ఇప్పుడు విరక్తిగా వేదనగా అనుకుంది. పెళ్లి ప్రయత్నాలు ఆవిధంగా బెడిసికొట్టాక మళ్లీ ఏ ప్రయత్నమూ చేయలేదు మహిమ.

నలభై ఐదేళ్ల మహిమ జుట్టు తెల్లబడుతోంది. కళ్లజోడు వచ్చింది. వళ్లూ వస్తూంది. అచ్చం ప్రొఫెసరమ్మలా కనిపిస్తూంది ఇప్పుడు.

ఇంట్లో కాలక్షేపానికి అన్న కూతురుని యూనివర్శిటీలో తనదగ్గిర చదివిస్తానని తెచ్చి పెట్టుకుంది పల్లవిని. అప్పటినుంచి కాస్త యింట్లో కాలక్షేపం అవుతోంది. అన్నగారు పెళ్లి పెటాకులు వద్దన్న మహిమ దగ్గర కూతురిని వుంచడానికి చాలా సందేహించాడు. వున్నచోట సీటు దొరక్క ఆఖరికి ఒప్పుకోక తప్పలేదు.

ఆరోజు అన్నగారు ఆ వూర్లో పల్లవికి ఏదో మంచి సంబంధం వుందంటే మాట్లాడడానికి వచ్చాడు. "ఇప్పుడా, నా పరీక్షలు అయితేగాని నేనేం చేసుకోను. ఇప్పుడేం సంబంధాలు చూడద్దు. చూసి నన్ను ప్రాణం తీయకండి. ముందే చెపుతున్నాను..." అంది పల్లవి.


అన్నగారు ఏదో అనేలోపలే "పరీక్షకేంలే... అవే అవుతాయి. పెళ్లి చేసుకుంటే ఏగ్జామ్స్ రాయకూడదనేం వుందా... ఫొటోలో అబ్బాయి బాగున్నాడు, మంచి ఉద్యోగం... వద్దనకు...." చటుక్కున అంది తనకు తెలియకుండానే. అంటూనే అన్నగారి వంక చూసింది. అన్నగారి మొహంలో ఆశ్చర్యం చూసి చటుక్కున చూపు మరల్చుకుని... అదేదో తమాషాకి అన్నట్లు "ఇదిగో పల్లూ నీవిలా అన్నావంటే... నీకేదో నేను నేర్పి పెట్టానని మా అన్న అనుకుంటారు" అంది నవ్వుతూ. అన్నగారి మొహంలో, కళ్లల్లో కన్పించిన భావాలకి తప్పు చేసిన దానిలా తల దించుకుంది.

రాత్రి ఆరుబయట కుర్చీలో కూర్చుంటే ట్రాన్సిస్టర్ లోంచి పాట - 'మనసున మనసై బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యమూ... అదే భాగ్యమూ... మనసుని కుదిపే పాట!! హు... మనసున మనసై కాకపోయినా బ్రతుకులో తోడుకరుండాలన్నది ఎంత నిజం! ఆ తోడు కోసమేనా... ఎన్ని ఇబ్బందులు, కష్టాలు, కన్నీళ్లు భరిస్తూ, జనం బంధానికి కట్టుబడ్డారన్నది ఎంత నిజం!

ఆ సత్యం... ఎంత ఆలస్యంగా అర్థం అయింది తనకి - ఒక్కసారి కాలాన్ని వాచీలా వెనక్కి తిప్పగలిగితే.....

### కాళ్లే ఆ తల్లి చేతులు!

ఇరవై తొమ్మిదేళ్ల డెబ్రా ఓడీ అనే అమెరికన్ మహిళకి పుట్టుకతోనే చేతులు అవకరంగా వుండడంతో కాళ్లనే చేతులుగా ఉపయోగించడం నేర్చుకుంది. వైవాహిక జీవితానికి తాను నోచుకోలేదని బాధపడిన ఆమె ఆత్మ సౌందర్యాన్ని చూసి ముగ్ధుడై డేవిడ్ అనే ముప్పై అయిదేళ్ల అతను ఆమెని వివాహం చేసుకున్నాడు. ఆమె ఇప్పుడు ఇద్దరు బిడ్డల తల్లి. వారి ఆలనా, పాలనయే గాకుండా, తన అక్క ఆఫీసుకెళ్తే, ఆమె నలుగురు బిడ్డల ఆలనా పాలనా కూడా డెబ్రాయే చూస్తోంది.



- డి. పద్మజ